క్లుప్తంగా

వడ్డీ మాఫీని వినియోగించుకోవాలి

అమలాపురం టౌన్: ప్రభుత్వం కల్పించిన వడ్డీ రాయితీని పట్టణంలోని బకాయి పన్నుల చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకుని గడువు లోపు అంటే ఈ నెల 31వ తేదీ లోపు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు శుక్రవారం ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. తమ ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులపై వడ్డీ మాఫీ వెసులుబాటు ఉపయోగించుకోవాలని సూచించారు. శుక్రవారం నుంచి ఈ నెల 31వ తేదీ ఉదయం వరకూ పట్టణంలో ఆటోల్లో మైకుల ద్వారా విస్తృత ప్రచారం చేస్తామని పేర్కొన్నారు. మున్సిపల్ రెవెన్యూ అధికారి (ఆర్వో) శిరిగినీడి శివాజీ కూడా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, తమ విభాగం సిబ్బంది ద్వారా ప్రజలకు వడ్డీ రాయితీ గురించి బకాయిదారుల ఇళ్లకు వెళ్లి మరీ అవగాహన కల్పిస్తున్నారు.

నేడు మండల సమావేశం

ఐ.పోలవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీఓ లక్ష్మిరెడ్డి ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేస్తారని పేర్కొన్నారు.

తాళ్లరేవులో వైఎస్సార్ కంటి వెలుగు



తాళ్లరేవు పంచాయతీ కార్యాలయంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తాళ్లరేవు: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం శుక్రవారం తాళ్లరేవులో జరిగింది. స్థానిక పంచాయతీ కార్యాలయంలో నేత్ర వైద్య నిపుణుడు ఎస్.సత్తిబాబు వృద్ధులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి శంకర్ నారాయణ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గ్లకోమా ప్రమాదకరం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పద్మశ్రీ రాణి, ఇతర వైద్యులు

అమలాపురం టౌన్: కంటికి వచ్చే వ్యాధుల్లో గ్లకోమా (నీటి కాసుల వ్యాధి) ప్రమాదకరమని, ఆ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే అంధత్వానికి దారి తీస్తుందని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయ కర్త డాక్టర్ బి.పద్మశ్రీ రాణి అన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రపంచ నీటి కాసుల వ్యాధి అవగాహన వారోత్సవాల్లో భాగంగా కంటి రోగులతో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ పద్మశ్రీ రాణి మాట్లాడారు. గ్లకోమా బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇన్, అవుట్ పేషెంట్లకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, ఆస్పత్రి కంటి వైద్య నిపుణులు డాక్టర్ హేమలత, డాక్టర్ సృజన అవగాహన కల్పించారు.

రక్తహీనతపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

ఉప్పలగుప్తం: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ వైఎస్సార్ క్రాంతి పథం మహిళలు శుక్రవారం ఉప్పలగుప్తంలో రక్తహీనతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కె.ఎస్.గౌరీకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీఎం కె.వెంకటలక్ష్మి, సీహెచ్‌వో విజయలక్ష్మి, హెల్త్‌సూపర్‌వైజర్ ఐ.చిట్టిబాబు, సీసీలు ఎస్.ఆనందబాబు, బి.సత్యనారాయణమ్మ, వీవోఏలు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరునికి పంచామృతాభిషేకం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామికి శుక్రవారం పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకం జరిపారు. అధిక సంఖ్యలో స్వామిని భక్తులు దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరి

ఆలమూరు: మండలంలోని జొన్నాడలో వేంచేసిన శ్రీ, భూ సమేత జనార్దనస్వామి ఆలయంలో జరుగుతున్న కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన గాత్ర కచేరి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్థానిక ఆలయ ఆవరణలో వేద పండితులు ద్విభాష్యం రవికృష్ణశర్మ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన ఈ గాత్ర కచేరిలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ గాయని చిట్టూరి రాధ పాల్గొని భక్తి కీర్తనలు ఆలపించారు. సరస్వతి నమోస్తుతే, శంకరాభరణం, మోహనరాగం ఆదితాళం తదితర రాగాలు భక్తులను అలరించాయి.

సత్తా చాటుతూ.. పతకాలు సాధిస్తూ

- వెయిట్ లిఫ్టింగ్‌లో రాణిస్తున్న యానాం యువత



పుదుచ్చేరి రాష్ట్ర వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు, ప్రశంసా పత్రాలతో క్రీడాకారులు



జాతీయ వెయిట్ లిఫ్టింగ్‌లో 178 కేజీల బరువు ఎత్తి సిల్వర్ మెడల్ సాధించిన వైదాడి దేవి

యానాం: వారంతా పేద కుటుంబం నుంచి వచ్చి చదువుకుంటున్నవారు. అయితే బరువులు ఎత్తడంలో వారు దిట్ట. కృషి, పట్టుదలతో పాటు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని సాధన చేస్తే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించారు యానాం శివారు సావిత్రినగర్, గిరియాంపేట మత్స్యకార గ్రామాలకు చెందిన యువతీ, యువకులు. సొంతంగానే ప్రాక్టీసు చేసుకుంటూ వెయిట్‌లిఫ్టింగ్ క్రీడలో అద్భుత ప్రదర్శనలు చేస్తూ పతకాలు సాధిస్తూ అందరి ప్రశంసలు పొందుతున్నారు. సావిత్రినగర్, గిరియాంపేట విద్యార్థులు పెసింగి శివరామకృష్ణ, వైదాడి దేవి, సంగాడి సంధ్యారాణి, కుడిపూడి విజయలక్ష్మి, మేడిశెట్టి పూజిత, జలదారపు భువనేశ్వరి, పెసింగి అనూష, పొన్నాడ మణికాసు, పాలెపు రవికుమార్, చింతా రామకృష్ణ, పట్టా మహేష్ కొన్నేళ్లుగా స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలో ప్రాక్టీసు చేస్తున్నారు. వారి ఆసక్తిని గమనించిన వెంకటేషన్ అనే తమిళ పీఈటీ వారితో పూర్తి స్థాయిలో సాధన చేయించి వెయిట్ లిఫ్టింగ్‌లో రాణించేలా తీర్చిదిద్దారు. అయితే ఆయన కారైకల్‌కు బదిలీ కావడంతో పెసింగి శివరామకృష్ణ మిగిలిన తన సహచర క్రీడాకారులకు వెయిట్ లిఫ్టింగ్‌లో మెలకువలు చెప్పి తీర్చిదిద్దాడు.

వివిధ అంతర్ రాష్ట్రపోటీల్లో పతకాలు..ప్రశంసలు

క్రీడాకారులందరూ స్థానిక ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్‌టీపీపీ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్నవారే కావడం విశేషం. ఈ నేపథ్యంలో పుదుచ్చేరి, కారైకల్‌లో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీలతో పాటు పుదుచ్చేరి రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లోను, ఇటీవలి జరిగిన పుదుచ్చేరి ఇంటర్ యూనివర్శిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లోను, గౌహతిలో జరిగిన ఖేల్‌ఇండియా, పాట్నాలో జరిగిన యూత్‌నేషనల్స్ పోటీల్లోను వీరు పాల్గొని పతకాలు సాధించారు. ముఖ్యంగా ఖేల్ ఇండియాలో వైదాడి దేవి 60కేజీల విభాగంలో ప్రతిభ కనబరచడం విశేషం. పెసింగి శివరామకృష్ణ 110 కేజీలను, పట్టా మహేష్ 90 కేజీలను, సంగాడి సంధ్యారాణి 40 కేజీలను, పెసింగి అనూష 25 కేజీలను, కుడిపూడి విజయలక్ష్మి 40 కేజీలను, మేడిశెట్టి పూజిత 35 కేజీలను, చింతా రామకృష్ణ 80 కేజీలను, పొన్నాడ మణికాసు 70 కేజీలను, రవికుమార్ 70 కేజీల విభాగంలో ప్రతిభ కనబరుస్తున్నారు.

మాజీ మంత్రి మల్లాడి సహాయ సహకారాలు

వెయిట్ లిఫ్టింగ్‌లో తాము రాణించడానికి ప్రధాన కారణం మాజీ మంత్రి, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అందించిన సహాయ సహకారాలేనని క్రీడాకారులు పేర్కొన్నారు. ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు తదితరులు తమకు ఆర్థికంగా సహకరిస్తున్నారని క్రీడాకారులు తెలిపారు.

ప్రకృతి విపత్తుల నిర్వహణపై వలంటీర్లకు శిక్షణ



సదస్సులో పాల్గొన్న ఆర్‌ఏవో మునిస్వామి

యానాం: పుదుచ్చేరి రెవెన్యూ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో ఆప్త మిత్ర వలంటీర్లకు స్థానిక డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ డిగ్రీ కళాశాల సమావేశపు గదిలో శుక్రవారం 12 రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమం ప్రారంభమయ్యింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్‌ఏవో మునిస్వామి మాట్లాడుతూ ప్రకృతి విపత్తులైన తుపాన్లు, వరదలు వచ్చినప్పుడు ఏవిధంగా వాటిని ఎదుర్కోవాలి, బాధితులను పునరావాస కేంద్రాలకు తరలింపు, సేఫ్టీ కిట్స్‌ల వినియోగం తదితరమైన వాటిపై అవగాహన పొందాలని కోరారు. యానాం నియోజకవర్గ పరిధిలోని సుమారు 70 మంది మహిళా, పురుష ఆపదమిత్ర వలంటీర్లు హాజరయ్యారు.

25న వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ



ఎంట్రుకోనలో వైఎస్సార్ ఆసరా వివరాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఏపీఎం సయ్యద్

అల్లవరం: వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా సంఘ సభ్యులకు మూడో విడత ఆసరా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ నెల 25 న పంపిణీ కార్యక్రమం ప్రారంభకానున్నదని ఏపీఎం సయ్యద్ శుక్రవారం తెలిపారు. వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 18 నుంచి 24 వరకు గ్రామ సంఘాలకు సమావేశం ఏర్పాటుచేసి ఆసరా వివరాలను లబ్ధిదారులకు వివరిస్తామన్నారు. ప్రతి వీఓఏ పరిధిలో లబ్ధిదారుల జాబితా ఉంచామన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఆసరా వివరాలను సంఘ సభ్యులకు వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో వీఓఏ పాల్గొన్నారు.

ఆసరాకు రూ.16.30 కోట్లు

అమలాపురం రూరల్: మండలంలోని 22 గ్రామాల్లో మూడో విడుత ఆసరా పథకంలో రూ.16.30 కోట్లు విడుదల చేస్తున్నట్లు ఎంపీఎం పీవీవీ రమణి తెలిపారు. ఈ నెల 25న వైఎస్సార్ ఆసరా పథకాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారన్నారు. దీనిలో భాగంగా మహిళ సంఘం సభ్యుల ఆసరా జాబితాలను సచివాలయాల్లో ప్రదర్శిస్తున్నారు. రూరల్ మండలంలో ఉన్న యానిమేటర్ ఈ వివరాలను గ్రామాల్లో ఉన్న ప్రతినిధులకు తెలియచేస్తున్నారు. సంఘం సభ్యులకు బొట్టుపెట్టి ఆసరా మూడు విడత సొమ్ములు వచ్చాయి అని వీఓఏలు తెలుపుతున్నారు. కామనగరువు, నల్లమిల్లి, జనుపెల్లి తదితర గ్రామాల్లో మహిళ సంఘాలకు వివరించారు.

పాఠశాలలు ఒంటిపూట నిర్వహించాలి

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో వేసవి ఎండ వేడిమి తదితర కారణాల రీత్యా పాఠశాలలు ఒంటిపూట నడిచేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం పుదుచ్చేరి ఎడ్యుకేషన్ డైరెక్టర్‌కు వినతిపత్రం పంపినట్లు యానాం యునైటెడ్ టీచర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు వీఏ వలీ ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది ఆంధ్రా, తెలంగాణ పాఠశాలల్లో మార్చి 15నుంచి ఒంటిపూట బడులు నిర్వహిస్తారని తెలిపారు. ప్రస్తుతం ఎండవేడిమితో పాటు వైరల్ జ్వరాలు పిల్లల్లో ఎక్కువగా ఉన్నాయని ఇప్పటికే పుదుచ్చేరి వ్యాప్తంగా హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లూయింజా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ఈనెల 16నుంచి 26వరకు సెలవులు ప్రకటించారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో యానాంలో ఒంటిపూట తరగతులు నిర్వహించాలని కోరారు.

ఘనంగా శ్రీకనకదుర్గాదేవి వార్షికోత్సవం



శ్రీకనకదుర్గాదేవి అమ్మవారు

యానాం: నియోజకవర్గ పరిధిలోని దొమ్మేటిపేట గ్రామంలో కొలువైన శ్రీకనకదుర్గదేవి 22వ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు రాయప్రోలు కిరణ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్రనామ కుంకుమపూజ నిర్వహించారు. యానాం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌అశోక్

యానాం: నియోజకవర్గ పరిధిలో దీర్ఘకాలంగా ఉన్న ప్రజాసమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. శుక్రవారం పుదుచ్చేరి అసెంబ్లీలో ఆయన ప్రశ్నోత్తరాల సమయంలో పలు సమస్యలు ప్రస్తావించారు. నియోజకవర్గ పరిధిలోని ఎస్సీలకు ఆదిద్రావిడశాఖ ద్వారా 1996–98లో తుపాను సమయంలో రూ.36వేలు, రూ.40వేల స్కీమ్ ద్వారా నిర్మాణమైన గృహాలు శిథిలమై ఉన్నాయని, పలువురు ఇంకా వాటిలోనే నివసిస్తున్నారని తక్షణం ఆ స్కీమ్‌ను రద్దుచేసి రూ.5లక్షలు చొప్పున ఆర్థిక సహాయం అందించాలని కోరారు. పీడబ్ల్యూడీ ద్వారా అమృత్‌స్కీమ్‌ను అమలు చేసి రక్షిత మంచినీటిని అందించాలని కోరారు. నియోజకవర్గంలో ప్రస్తుతం ఉన్న పలు రోడ్లు, డ్రెయిన్‌ల మరమ్మతుల కోసం నిధులు విడుదల చేయాలన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన నిధులు ఖర్చు చేయకుండా వెనుకకు పంపినవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పర్యాటకశాఖ ద్వారా కోట్లాది రూపాయల ఖర్చుతో పలు చోట్ల వృథాగా అనేక ప్రాజెక్టులు నిర్మించిందని ప్రస్తుతం అవి శిథిలస్థితికి చేరుకున్నాయని, వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ఆదాయం వచ్చేలా మలచాలని కోరారు. గత ఆగస్టు నెలలో వచ్చిన వరదలతో రాజీవ్ బీచ్ దెబ్బతిందని, మరమ్మతులకు నిధులు విడుదల చేయాలనికోరారు. పర్యాటకశాఖ ద్వారా క్రూయిజ్‌షిప్‌ను నడపాలని కోరారు. వివిధ శాఖల్లో అవుట్‌సోర్సింగ్ ద్వారా పనిచేస్తున్న సిబ్బందికి సంబంధిత ప్రైవేట్ కాంటాక్టు సంస్థ సొమ్మును సక్రమంగా చెల్లించడం లేదన్నారు. లేబర్ డిపార్ట్‌మెంట్ ద్వారా అవుట్‌సోర్సింగ్ నియామకాలు చేపట్టాలని కోరారు. పాత దేవస్థానం కమిటీ, మాజీలుగాఉన్న కొందరు అనాలోచితంగా 600 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని కూల్చేసారని దీనిపై విజిలెన్స్ విచారణ చేయాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నట్టు సామాన్య ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, పీసీఎస్ స్థాయి అధికారిని నియమించాలని కోరారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



కార్యవర్గ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైనది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గం స్థానిక బంగారు, వెండి వర్తకుల సంఘం భవనంలో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసింది. పట్టణ వ్యాపారుల సమస్యలపై స్పందించి పరిష్కారానికి నూతన కార్యవర్గం కృషి చేస్తుందని చాంబర్ నూతన అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ (సత్తిబాబు) అన్నారు. నూతన కార్యవర్గంతో చాంబర్ మాజీ అధ్యక్షుడు గోకరకొండ హరిబాబు ప్రమాణ స్వీకారం చేయించారు. చాంబర్ గౌరవాధ్యక్షుడు అల్లాడ స్వామినాయుడు, గౌరవ కార్యదర్శి కొవ్వూరి వెంకటరెడ్డి, గౌరవ సలహాదారు వాసన పుల్లయ్యనాయుడు, ఉపాధ్యక్షులు చిట్టూరి పెదబాబు, మోకా వెంకట సుబ్బారావు, వలవల శివరావు, అల్లూరి రమేష్‌రాజు, నల్లా మల్లిబాబు, నంబూరి సత్యనారాయణమూర్తి, ముఖ్య సలహాదారులు నల్లా పవన్‌కుమార్, కంచిపల్లి అబ్బులు, కార్యదర్శి దొమ్మేటి సాయిబాబు ప్రమాణ స్వీకారం చేశారు.

సీఎం సార్‌కు రుణపడి ఉంటాం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్ తదితరులు

ఐ.పోలవరం: మమ్మల్ని ఆదుకొన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని బాధిత కుటుంబం పేర్కొంది. ఐ.పోలవరం మండలం జి.వేమవరం వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మారిశెట్టి బ్రహ్మాజీ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. దీనిపై సీఎం సహాయ నిధి నుంచి రూ.5లక్షలు విడుదల చేశారు. శుక్రవారం అమరావతి సచివాలయం వద్ద బ్రహ్మాజీ భార్య భాగ్యలక్ష్మి, కుమారుడు వెంకన్నబాబుకు ఐదు లక్షల చెక్కును ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అందజేశారు. జీవితాంతం సీఎంకు, ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామని వారు సంతోషం వ్యక్తం చేశారు. కష్టకాలంలో ఆదుకొనే మనసున్న వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని అన్నారు. ఈయన వెంట పార్టీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు మెండా వెంకన్నబాబు ఉన్నారు.

సీసీ కెమెరా ఆధారంగా నిందితుడి గుర్తింపు



స్వాధీనం చేసుకున్న బైక్‌తో యానాం పోలీసులు

యానాం: సీసీ కెమెరాల ఆధారంగా బైక్ దొంగతనానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు గుర్తించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం ఎస్సై శేరు నూకరాజు వెల్లడించారు. ఈ నెల 15వ తేదీ రాత్రి పట్టణ పరిధిలోని గొలగాబత్తులవారి వీధిలో కుమార్‌జనరల్ స్టోర్స్ ఎదురుగా తోట వీరభద్రరావు తన హోండా స్కూటీని నిలిపి, పక్కనే ఉన్న తన గృహానికి వెళ్లాడన్నారు. మరుసటి రోజు ఉదయం చూసుకునేటప్పటికి స్కూటీ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడని తెలిపారు. దీంతో సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించగా నీలపల్లి గ్రామానికి చెందిన సంగాని గంగాద్రి మారుతాళాలతో దొంగిలించి స్కూటీని అమ్మకం చేసేందుకు తన ఇంటి వద్దనే ఉంచుకున్నాడని తెలిపారు. కేసు నమోదుచేసి నీలపల్లిలో నిందితుడి ఇంటికి వెళ్లి బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని రిమాండ్ కోసం యానాం సబ్‌కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

23లోగా దరఖాస్తు చేసుకోవాలి

పి.గన్నవరం: నరేంద్రపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంగ్లీషు మీడియంలో చేరేందుకు అర్హత గల విద్యార్థులు ఈనెల 23 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ నక్కా శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సంబంధిత విద్యార్హత పత్రాలతో పాటు, పాస్‌పోర్టు ఫొటో, ఆధార్, రేషన్ కార్డుల జెరాక్స్ కాపీలతో తమను సంప్రదించాలని ఆయన సూచించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

రామచంద్రపురం రూరల్: ఈనెల 14న ఆత్మహత్యకు పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ శుక్రవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఎస్సై వినోద్ తెలిపిన వివరాల ప్రకారం వెలంపాలెం గ్రామానికి చెందిన మేడిది ఆనంతలక్ష్మి (34) కుటుంబ కలహాల నేపథ్యంలో ఈనెల 14న పొలానికి వాడే గడ్డిమందు తాగింది. ఈమెను వైద్య కోసం కాకినాడ ప్రైవేటు ఆసుపత్రితో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

116 రోజులుగా నాగసాధన



సర్పహోమం నిర్వహిస్తున్న దొరబాబు, రూపావతి దంపతులు

అమలాపురం రూరల్: స్థానిక విద్యుత్‌నగర్‌లో ఆదిశేష నిలయంలో అఖండ దీప సముఖంలో నిర్వహిస్తున్న వారాహి అఖండ హోమం, అఖండ నాగసాధన, మహోత్సవాల్లో గత 115 రోజులుగా నాగసాధన నిరవధికంగా నిర్వహిస్తున్నారు. చివరిగా 116వ రోజు శుక్రవారం ఉదయం తూము దొరబాబు, రూపావతి దంపతులతో విశేష నాగపూజ, నాగసాధన, అభిషేకం, సామూహిక మంత్ర జపం, సర్పహోమం తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. మానవజీవితంలో ఎదురయ్యే అనేక ప్రతిబంధకాలను నిరోధించడానికి మానవ శరీరంలో ఆధ్యాత్మిక కుండలిని శక్తి క్రియాన్వితం చేయటానికి నాగసాధన ఉపకరిస్తుందని నిర్వాకుడు పోతురాజు రామకృష్ణారావు తెలిపారు. నాగసాధకులు లింగోలు విస్సు శిరీష, చాగంటి ప్రసాద్ నందు, పోతురాజు రామకృష్ణారావు కనకదుర్గ దంపతులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

ముమ్మిడివరం: ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లిషు పేపర్ పరీక్షలు ముమ్మిడివరంలో శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. తారా జూనియర్ కళాశాల, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మొత్తం 599 మంది విద్యార్థులకు గాను 551 మంది పరీక్షలు రాశారు. 48 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. తారా జూనియర్ కళాశాలలో 280 మందికి 257 మంది, గురుకుల పాఠశాలలో 319 మందికి 294 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై కె.సురేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రైతుల రాస్తారోకో

అధికారుల హామీతో విరమణ



ఆందోళనలో పాల్గొన్న రైతులు

తాళ్లరేవు: సాగునీటి ఎద్దడి నివారించాలని కోరుతూ తాళ్లరేవు, కాజులూరు మండలాలకు చెందిన రైతులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. మండల పరిధిలోని ఇంజరం వంతెన వద్ద ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో సుమారు మూడు గంటల పాటు రైతులు ఆందోళన చేశారు. దీంతో యానాం–ద్రాక్షారామ రహదారిలో ట్రాఫిక్‌కుఅంతరాయం కలిగింది. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టి.ఈశ్వరరావు మాట్లాడుతూ ఇంజరం వంతెన కుంగడంతో మూడేళ్ల క్రితం నిర్మించిన 8 తూరల కల్వర్టు వల్ల రోజూ చెత్త పేరుకుపోయి తాళ్లరేవు మండలానికి సాగునీరు పూర్తిస్థాయిలో రావడంలేదని అన్నారు. ఆర్అండ్‌బీ ఈఈ రమేష్ కుమార్ మాట్లాడుతూ రోజూ చెత్తను తొలగించే ఏర్పాటు చేస్తామన్నారు. కల్వర్టు నిర్మాణ సమయంలో కాజులూరు మండలం కోలంక పరిధిలోని పంట పొలాలకు ఏర్పాటు చేసిన తూర కుంగిపోయి కోలంక, గొప్పిరేవు ప్రాంతాలకు నీరు రాకపోవడం తమ దృష్టికి వచ్చిందని ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తామని ఈఈ హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్ రైతులతో చర్చించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఆర్అండ్‌బీ ఏఈ లక్ష్మీప్రసన్న, ఇరిగేషన్ ఏఈ ఈశ్వరరావు పాల్గొన్నారు.

రేపు ఉగాది సాహితీ సభ, కవి సమ్మేళనం

కొత్తపేట: శ్రీశోభకృత్ నామ సంవత్సరం ఉగాది సాహితీ సభ, కవి సమ్మేళనం కార్యక్రమాలు ఆదివారం స్థానిక ఎంవీఎస్ సుబ్బరాజు కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్టు కళాసాహితీ అధ్యక్షుడు పెన్మెత్స హరిహరదేవళరాజు, ప్రధాన కార్యదర్శి గిడ్డి సుబ్బారావు తెలిపారు. కొత్తపేటలో 1989 ఉగాది సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎంవీఎస్ సుబ్బరాజు అధ్యక్షుడిగా, ప్రముఖ కవి, రచయిత గిడ్డి సుబ్బారావు ప్రధాన కార్యదర్శిగా, పలువురు స్థానిక కవులు, రచయితలు, సాహితీవేత్తలు సభ్యులుగా 'కళాసాహితి' ఏర్పడింది. అప్పటి నుంచి ఏటా క్రమం తప్పకుండా ఉగాది సాహితీ సభలు, కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. ప్రముఖ కవి, విమర్శకుడు డాక్టర్ అద్దేపల్లి రామమోహనరావు ముఖ్యఅతిథిగా పాల్గొనేవారు. ఎంవీఎస్ సుబ్బరాజు మరణానంతరం పెన్మెత్స హరిహర దేవళరాజు అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నుంచే కాక రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి కవులు, కళాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటారు. దానిలో భాగంగా ఈ ఏడాది 35వ సాహితీ సభ, కవి సమ్మేళనం ఏటా కంటే ఘనంగా నిర్వహించనున్నారు. ఆ ఏర్పాట్లపై శుక్రవారం సాయంత్రం సుబ్బారావు స్వగృహంలో దేవళరాజు, సభ్యుడు ఏబీసీ దేవ్ తదితరులు చర్చించారు. బహుభాషా కోవిదుడు, ప్రియదర్శినీ బాలవిహార్ వ్యవస్థాపకుడు అద్దంకి కేశవరావు రచనలు అశోకుడు (ఏకపాత్ర), గౌతమ కల్యాణం (నృత్యరూపకం) ఆవిష్కరణ కార్యక్రమం, అనంతరం కవి సమ్మేళనం జరుగుతుందని ఆయన తెలిపారు. కవులు, కళాకారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.


విజ్ఞానదాయకంగా సైన్స్ ఫెయిర్



ప్రదర్శలను తిలకిస్తున్న కోనసీమ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మూర్తి

అమలాపురం టౌన్: స్థానిక సర్ సీవీ రామన్ స్కూలులో ద ఫస్ట్ ఆఫ్ యంగ్ సైంటిస్ట్ పేరుతో శుక్రవారం జరిగిన సైన్స్ ఫెయిర్ విజ్ఞానదాయకంగా జరిగింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కోనసీమ శాఖ అధ్యక్షుడు, స్థానిక రోహిణి చిన్న పిల్లల ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ వీఏస్ఎస్ఎన్ మూర్తి సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కూలు విద్యార్థులు పలు సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలను డాక్టర్ మూర్తి పరిశీలించి విద్యార్థులను అభినందించారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ జనరల్ సెక్రటరీగా 'రాతు'



రావులపాలెం: నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) కోనసీమ జిల్లా జనరల్ సెక్రటరీగా రాతు ఈశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ పి.సంపత్‌కుమార్ నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నట్టు ఈశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల ఉల్లంఘన సమస్యలపై తమ సంఘ సభ్యులతో కలసి పోరాడుతామన్నారు. తనకు అవకాశం కల్పించిన జిల్లా అధ్యక్షుడు అడబాల సాయికి కృతజ్ఞతలు తెలిపారు.